సాక్షి అనకాపల్లి

మంగళవారం । 13 । జూన్ । 2023



ప్రతి అర్జీకీ సమాధానం

కలెక్టరేట్ స్పందనకు 129 అర్జీలు వచ్చాయి. ప్రతి అర్జీకి స్పష్టమైన రీతిలో సమాధానం ఇవ్వాలని జేసీ ఆదేశించారు. 8లో



ర్యాంకర్‌కు సత్కారం

విశాఖ: సివిల్స్‌లో 315వ ర్యాంకు సాధించిన ఆశ్రితను ఆదిత్య డిగ్రీ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.



కవి సమ్మేళనం

విశాఖ: లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సన్నిధిలో సోమవారం కవి సమ్మేళనం జరిగింది.

న్యూస్‌రీల్

అయోధ్యలో ప్రతిష్ఠించనున్న శ్రీరామ పాదుకలు



శంకరమఠంలో ఉంచిన శ్రీరామ పాదుకలు

సీతంపేట (విశాఖ): అయోధ్యలో ప్రతిష్ఠించనున్న శ్రీరాముని పాదుకలు భక్తుల సందర్శనార్థం స్థానిక శంకరమఠంలో ఉంచారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శంకరమఠంలో ఉంచగా పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు పాదుకలను దర్శించారు. జైశ్రీరామ్ అంటూ భక్తితో నమస్కరించి పాదాలను తాకారు. ముందుగా వేద పండితులు పూజలు చేశారు. ఈ సందర్భంగా పాదుకలను తయారు చేయించిన శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ ఎనిమిది కిలోల వెండి, దానిపై బంగారు తొడుగు కూడా చేయించాన్నారు. ఏడాదిన్నర కాలంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాలలో శ్రీరామ పాదుకలను భక్తుల సందర్శనార్థం ఉంచి, అక్కడి వేద పండితులు, అర్చకులతో పూజలు చేయిస్తున్నట్టు తెలిపారు. సాగర్‌నగర్‌లోని ఇస్కాన్, శ్రీకూర్మం, అరసవిల్లి, పూరీ, ద్వారకా, బదరీనాథ్ వంటి పుణ్యక్షేత్రాలలో పూజలు చేసిన తర్వాత అయోధ్యకు పాదుకలు చేర్చుతానన్నారు. నవంబర్ ఒకటిన భద్రాచలం నుంచి చత్రపూర్ మీదుగా పాదయాత్రగా బయలుదేరి అయోధ్యకు చేరుకుని జనవరి 26న పాదుకలు ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు. అయోధ్య రామమందిర శంకుస్థాపన సమయంలో ఐదు వెండి ఇటుకలు బహూకరించినట్టు తెలిపారు.

స్పందించిన కలెక్టర్

17 మంది టీచర్లకు ఏప్రిల్, మే నెల జీతాల విడుదల

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ పరిధి పెద్దహైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న 17మంది ఉపాధ్యాయులకు ఏప్రిల్, మే నెల జీతాలు ఎట్టకేలకు మంజూరయ్యాయి. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విశాఖలోని మధురవాడ నుంచి డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. దీంతో జీతాల బిల్లులపై ఆయన సంతకం పెట్టలేదు. దీనిపై ఉపాధ్యాయులు స్పందనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి మొరపెట్టుకున్నారు. రెండు మాసాలుగా జీతాల్లేకుండా ఉన్న వైనంపై ఆయన తక్షణమే స్పందించారు. ఈ మేరకు డీఈవోకు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయుని స్థానంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా జె.సత్తిబాబుకు బాధ్యతలు అప్పగించారు. ఆయన త్వరితగతిన చర్యలు తీసుకున్నారు. ఉపాధ్యాయుల బ్యాంక్ ఖాతాల్లో జీతాలు జమ అయినట్లు సత్తిబాబు వెల్లడించారు.

15 నుంచి ఐటీఐ ప్రవేశాలు

నర్సీపట్నం : జిల్లాలో ఉన్న రెండు ప్రభుత్వ, 29 ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 15 నుంచి 18 వరకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 881 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నట్టు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల మొబైల్ ఫోన్‌లకు ఎస్‌ఎంఎస్ ద్వారా ఇప్పటికే సమాచారం అందించామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వారికి సూచించిన తేదీల్లో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో వాణిశ్రీ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం సినీ నటి వాణిశ్రీ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందజేశారు.

పూడిమడకలో జేసీ పర్యటన



పూడిమడక తీరాన్ని పరిశీలిస్తున్న జేసీ జాహ్నవి

అచ్యుతాపురం (అనకాపల్లి): జాయింట్ కలెక్టర్ జాహ్నవి సోమవారం పూడిమడకలో పర్యటించారు. సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేయతలపెట్టిన పర్యాటక కేంద్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆరా తీశారు. పర్యాటక ప్రాజెక్టును కొత్తేరు నుంచి వేరొక ప్రాంతానికి తరలించాలని స్థానికులు జేసీని కోరారు.



స్కూలుకు పోదాం చలోచలో: అనకాపల్లిలో జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌కు చేరుకుంటున్న విద్యార్థులు



చదువుకు శ్రీకారం: వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో పాఠాలు వింటున్న టెన్త్ విద్యార్థులు



జగనన్న గోరుముద్ద: ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో దివాకర్

వడివడిగా బడి బాట

బడిగంట గణగణమోగింది.. అప్పటికే కిలకిలమంటూ చిన్నారులు చేరుకున్నారు.. పాత తరగతి గదిని చూసి, గతేడాది జ్ఞాపకాలను ఒక్క క్షణం అవలోకించి, కొత్త క్లాసు రూములోకి పరుగులు తీశారు.. మొదటి రోజునే జగనన్న విద్యాదీవెన కిట్‌లు అందుకోవడం వారిలో ఆనందం నింపింది.. కొత్త పుస్తకాలను చూస్తే నూతనోత్సాహం పొంగుకొస్తుంది.. అక్కడే చకచకా చదివేయాలనిస్తుంది.. ఉపాధ్యాయులు తొలి రోజునే బోధనకు శ్రీకారం చుట్టారు.. క్లాస్ అయ్యాక సెలవుల్లో ఎలా కాలక్షేపం చేశారో కబుర్లు చెప్పుకుంటూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు.. మళ్లీ గంట మోగగానే ఇంటి దారి పట్టారు.. ఇవీ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనిపించిన తొలి రోజు దృశ్యాలు..

పిల్లల చదువు జగనన్న బాధ్యత

- 28న తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి నిధుల జమ
- జగనన్న విద్యా కానుక పంపిణీలో డిప్యూటీ సీఎం బూడి, మంత్రి గుడివాడ



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి, మంత్రి గుడివాడ, ఎమ్మెల్యే గణేష్, కలెక్టర్

నాతవరం : జగనన్న విద్యా కానుక పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు అందించడంతో పండగ వాతావరణం కనిపిస్తోందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నాతవరం హైస్కూల్లో ఆదివారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రులు మాట్లాడారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కారాదనే సీఎం జగన్ అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన తదితర విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లను తలపించేలా నాడు–నేడు పథకంలో రూ.వేల కోట్లతో తీర్చిదిద్దారని కొనియాడారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అత్యంత నాణ్యతా ప్రమాణాలతో విద్యా కానుక పేరిట కిట్లను అందిస్తున్నామన్నారు. ఈ నెల 28న అమ్మఒడి పథకం నగదు తల్లుల ఖాతాల్లో జమకానుందన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా జిల్లాను విద్యా రంగంలో ప్రథమ స్థానంలో నిలపాలని అధికారులను సూచించారు. విద్యార్థులకు ఏ సమస్యలున్నా ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. జిల్లాలో జగనన్న విద్యా కానుక కిట్ల వివరాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ వివరించారు.

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మండలంలో అధిక మార్కులు పొందిన విద్యార్థులకు దివంగత నేత, సమితి మాజీ అధ్యక్షుడు అంకంరెడ్డి నూకరాజునాయుడు, భార్య పార్వతమ్మ జ్ఞాపకార్థం కుటుంబీకులు సమకూర్చిన నగదు, షీల్డులను మంత్రుల చేతుల మీదుగా అందించారు. జగనన్న విద్యా కానుక కిట్లను మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టరు విద్యార్థులకు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీలు కరక రేణుక, చెక్కా ప్రభావతి, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బి.సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు తమరాన నాయుడు, కోనేటి రామకృష్ణ, గొలుగొండ, మాకవరపాలెం, నర్సీపట్నం మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పండగలా ఉంది



నాలుగేళ్ల నుంచి మాలాంటి పేద విద్యార్థుల బతుకుల్లో చాలా మార్పు వచ్చింది. కార్పొరేట్ స్కూళ్లను మించి వసతులున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక కిట్లు ఇవ్వడంతో పండగలా అనిపిస్తోంది. స్కూల్‌కు మా అమ్మనాన్నతో కలిసి వచ్చాం. మేం ఏమీ కొనుక్కోవాల్సిన అవసరం లేదు. మా చదువుకు కావాల్సినవన్నీ ఉన్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– సంబారు ఆశ్రిత, 8వ తరగతి, గునుపూడి హైస్కూల్

జీవితంలో గుర్తుండిపోతుంది



జగనన్న విద్యా కానుక కిట్లలో మేం చదువుకోవడానికి అవసరమైనవి అన్ని ఉన్నాయి. అమ్మానాన్నలపై భారం తగ్గింది. ఆనందంగా చదువుకుంటాం. స్కూల్లో పౌష్టికాహారంతో కూడిన భోజనం పెడుతున్నారు. రాగి జావా చాలా బాగుంటుంది. కిట్లు మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా తీసుకోవడం జీవితాంతం గుర్తుండిపోతుంది.

– బోడ్డు మధుశాలి, చిన గొలుగొండపేట గ్రామం

కనిపించే దేవుడు



దేవుడికి పూజలు చేస్తాం. అయినా ఎవరికి ఏమిస్తాడో తెలియదు. సీఎం జగన్ ఓటేసినవాళ్లకు, వేయనోళ్లకు కూడా ఒకేలా న్యాయం చేస్తున్నారు. గతంలో స్కూళ్లు తెరుస్తారంటే పిల్లలకు పుస్తకాలు, బట్టలు, ఇతర వస్తువులు కొనాలంటే భయమేసేది. జగనన్న దయ వల్ల మాకు ఎలాంటి ఆర్థిక భారం లేదు. పిల్లల చదువుకు కావాల్సినవన్నీ ఆయనే ఇస్తున్నారు. అదనంగా అమ్మొడి డబ్బులూ వేస్తున్నారు.

– పైల రామలక్ష్మి, విద్యార్థి తల్లి, నాతవరం

శరవేగంగా రెండో విడత నాడు-నేడు పనులు



కేజీబీవీలో ప్రిన్సిపాల్ భవానికి సూచనలు ఇస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నాతవరం : జిల్లాలో రెండో విడత నాడు–నేడు పథకం కింద రూ.253.51 కోట్లతో 605 పాఠశాలల్ని అభివృద్ధి చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మర్రిపాలెం కస్తూర్బా పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో నాడు–నేడు పథకంలో 518 పాఠశాలలు, 68 అంగన్‌వాడీ కేంద్రాలు, 19 జూనియర్ కాలేజీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. మంజూరు చేసిన మొత్తంలో రూ.88 కోట్ల 22 లక్షలు విడుదల చేయగా, నిబంధనల మేరకు పూర్తయిన పనులకు రూ.77 కోట్ల 12 బిల్లుల సకాలంలో చెల్లింపులు జరిపినట్టు పేర్కొన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడేది లేదన్నారు. గత ఏడాది జిల్లాలో 1,435 పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు 16,499 మందికి ట్యాబ్ లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో జగనన్న గోరుముద్ద లబ్ధిదారులు 1,23,717 మంది, అమ్మ ఒడి లబ్ధిదారులు 1,52,106 మంది ఉన్నట్టు తెలిపారు. జీసీడీవో శ్రీలక్ష్మి, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, జిల్లా కోఆర్డినేటరు సత్యవరప్రసాద్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ భవాని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ కాఠిన్యం

- లైంగిక బాధితురాలి పట్ల నిర్లక్ష్యం
- ఎస్పీ స్పందనలో తండ్రి ఫిర్యాదు



స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధిత యువతి తండ్రి

కశింకోట: లైంగిక దాడికి గురైన యువతి పట్ల అమానవీయంగా ప్రవర్తించిన మహిళా కానిస్టేబుల్‌పై చర్య తీసుకోవాలని బాధితురాలి తండ్రి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ఎస్పీ మురళీకృష్ణ ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఫిర్యాదులో వివరాలు.. ఈనెల 5న తన కుమార్తె స్వగ్రామమైన సోమవరం వచ్చేందుకు నరసింగబిల్లి వద్ద వేచి ఉండగా అదే గ్రామానికి చెందిన కరణం నాగేంద్ర ఇంటి వద్ద దింపుతానని బలవంతంగా బైక్ ఎక్కించుకున్నాడు. నరసింగబిల్లి వద్ద రైల్వే పట్టాల సమీపంలో అండర్ పాస్ వద్దకు తీసుకెళ్లి కొట్టి, బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసు స్టేషన్‌కు తన కుమార్తెను తీసుకువెళ్లి అదే రోజు రాత్రి ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి వివరాలు తీసుకున్నారు. కేజీహెచ్‌కు వైద్య పరీక్షల నిమిత్తం తరలించడానికి రావాలని మహిళా కానిస్టేబుల్ దేవికి రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఎస్ఐ ఫోన్ చేశారు. అయినా రాకపోవడంతో మరో కానిస్టేబుల్‌తో ఫోన్ చేయించారు. బాధితురాలు తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుంటే.. మహిళా పోలీస్ అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వచ్చింది. ఆలస్యమైనందుకు ప్రశ్నించిన ఎస్ఐ ఆదినారాయణరెడ్డితో దురుసుగా ప్రవర్తించింది. ఎస్ఐ జీపులో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. వైద్య పరీక్షలకు వెళ్లినప్పుడు లైంగిక దాడికి గురైన తన కుమార్తె పట్ల, తమ పట్ల మహిళా కానిస్టేబుల్ అమానవీయంగా వ్యవహరించింది. ఎస్పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె అన్న కూడా తమకు ఫోన్ చేసి బెదిరించారు. పోలీసు వ్యవస్థ గౌరవానికి నష్టం కలిగించే విధంగా ప్రవర్తించిన మహిళా కానిస్టేబుల్, ఎస్పీ కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేశారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



యోగా శిక్షణలో మాట్లాడుతున్న రిత్‌దేవ్‌జీ

అనకాపల్లి టౌన్: నిత్యం యోగా చేయడంతో శరీరంలో నాడీ వ్యవస్థకు రక్తప్రసరణ చక్కగా జరుగుతుందని హరిద్వార్‌లోని భారత్ పతంజలి యోగా ఉపాధ్యక్షుడు రిత్‌దేవ్‌జీ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాను నేడు ప్రపంచ దేశాలన్నీ అనుసరిస్తున్నాయన్నారు. జూన్ 21వ తేదీని యోగా దినోత్సవంగా పాటిస్తున్నాయన్నారు. యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. 2014లో 177 దేశాల మద్దతుతో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. యోగా గురువులు దొరమ్మ నాయుడు, చినబాబు, మాదేటి జనార్దన్, మంగయ్య, కొలపర్తి కన్నబాబు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మహర్దశ

- రాజయ్యపేట జెట్టీ నిర్మాణానికి వడివడిగా అడుగులు
- రూ.24 కోట్లు కేటాయించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- 30 మత్స్యకార గ్రామాలకు ప్రయోజనం
- మత్స్యసంపద ఎగుమతులు, దిగుమతులు, మార్కెటింగ్‌కు అవకాశం



జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి (ఫైల్)

నక్కపల్లి: గంగపుత్రుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి (జెట్టీ) వడివడిగా అడుగులు పడుతున్నాయి. ముందుగా జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణను రెవెన్యూ అధికారులు వేగవంతం చేశారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.24 కోట్లు కేటాయించాయి. ఈ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రతిపాదనను మత్స్యశాఖ సిద్ధం చేసింది. జెట్టీ నిర్మాణానికి అవసరమైన అన్ని అనుమతులు మంజూరైనట్టు అధికారులు తెలిపారు. జెట్టీ నిర్మాణానికి పది ఎకరాల స్థలం అవసరం కావడంతో రాజయ్యపేట, దొండవాక తీరప్రాంతాల్లో అటవీశాఖకు చెందిన భూమిని అధికారులు పరిశీలించారు. ఈ భూమిని జెట్టీ నిర్మాణం కోసం తీసుకుని ప్రత్యామ్నాయంగా వేరొకచోట అటవీ శాఖకు భూమి కేటాయించేందుకు ప్రతిపాదనలు తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, మత్స్యశాఖ జేడీలు పలు పర్యాయాలు రాజయ్యపేట, దొండవాక ప్రాంతాల్లో పర్యటించి జెట్టీ నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణానికి మొత్తం రూ.24.77 కోట్లు ఖర్చవుతుందని అంచనాలు తయారు చేయగా.. కేంద్రం తన వాటా కింద రూ.14.86 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.9.90 కోట్లు మంజూరు చేసింది.

భూసేకరణ ప్రక్రియ ప్రారంభం

నక్కపల్లి మండలంలో జెట్టీ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ ప్రక్రియ వేగవంతం చేశాం. కేంద్రం నుంచి నిధుల కేటాయింపుతో పాటు అనుమతులు వచ్చాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తయితే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. రాజయ్యపేట, దొండవాక ప్రాంతాల్లో పదెకరాలను పరిశీలించాం. రెవెన్యూ అధికారులతో కలిసి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించడం జరిగింది.

–లక్ష్మణరావు, ఫిషరీస్ జేడీ

కేటాయింపులివీ..

- జెట్టీ ఏర్పాటుకు మంజూరైన రూ.24 కోట్లను వివిధ నిర్మాణాలకు వెచ్చించనున్నారు. అధికారుల ప్రతిపాదనలు ఈవిధంగా ఉన్నాయి..
- రూ.2.32 కోట్లు వెచ్చించి జెట్టీ, ఇతర భవనాల నిర్మాణానికి అవసరమయ్యే భూమిని సిద్ధం చేస్తారు.
- పచ్చదనం కోసం రూ.33 లక్షలతో మొక్కల పెంపకం చేపడతారు.
- రూ.34 లక్షలతో వాహనాల పార్కింగ్
- రూ.1.86 కోట్లతో చేపలను ఎండబెట్టుకునేందుకు 2 ప్లాట్‌ఫారాల నిర్మాణం
- రూ.15 లక్షలతో ట్రక్ పార్కింగ్ కేంద్రం
- రూ.21 లక్షలతో మత్స్య సంపద కోసం లోడింగ్ సెంటర్ (షెడ్లు) ఏర్పాటు
- రూ.1.11కోట్ల వ్యయంతో చేపలను విక్రయించడం, వేలం వేయడం,కొనుగోల్లు,అమ్మకాల కోసం ప్రత్యేకంగా పెద్దపెద్ద హాళ్లు నిర్మిస్తారు.
- రూ.5.94 లక్షలతో ఫిష్ ల్యాండింగ్ ప్లాట్‌ఫారాలు
- రూ.32.24 లక్షలతో బీచ్ ల్యాండింగ్ ప్లాట్‌ఫారం
- రూ.7.11 కోట్లతో మెకనైజ్డ్, మోటారుబోట్లు, ఇంజన్లు తెప్పల పార్కింగ్, మరమ్మతుల కోసం ప్రత్యేకంగా భవనాలు, షెడ్ల నిర్మాణం
- రూ.1.98 కోట్లతో జెట్టీ నిర్మించే ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు
- రూ.64 లక్షల వ్యయంతో మురికినీటిపారుదల కాలువలు
- రూ.1.14 కోట్లతో ప్రహరీ గోడ నిర్మాణం
- రూ.9.88 లక్షల వ్యయంతో వ్యర్థజలాలను శుద్ధి చేసే ప్లాంట్
- రూ.46.92 లక్షలతో వలల మరమ్మతులు, భద్రపరచుకునే షెడ్లు
- రూ.39.42 లక్షలతో విశ్రాంతి భవనాలు
- రూ.10 లక్షలతో మరుగుదొడ్ల ఏర్పాటు
- రూ.27.22 లక్షలతో తాగునీరు, వాడుక నీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- జెట్టీ చుట్టూ బయోఫెన్సింగ్, పటిష్టమైన రక్షణ గేటు కోసం రూ.9.16 లక్షలు
- రూ.16 లక్షలతో నీటివనరులైన బోర్లు, గొట్టపు బావులు, మోటార్లు బూస్టర్ క్లీనింగ్ సదుపాయాలు
- రూ.80.85 లక్షలతో విద్యుత్ సదుపాయం, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధి దీపాలు వంటి సదుపాయాలు
- విద్యుత్ సరఫరా, కనెక్షన్ల కోసం మరో రూ.80 లక్షలు
- ముందస్తు అధ్యయనాల కోసం రూ.20 లక్షలు
- అత్యవసర పరిస్థితుల్లో ఖర్చు చేసేందుకు రూ.60 లక్షల కేటాయింపు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతిచెందిన కిల్లో కళ (ఫైల్)

అనంతగిరి : డుంబ్రిగుడ మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామానికి చెందిన వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ సంతోష్ తెలిపిన వివరాలివి. బడిమెల గ్రామానికి చెందిన కిల్లో కళ (31) సోమవారం ఉదయం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. స్థానికులు అందించిన సమాచారంతో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కళ మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా లేక హత్య చేశారా? అనే కోణంలోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తన కుమార్తెను చిత్రహింసలకు గురి చేసి, అల్లుడే హత్య చేసి ఉంటాడని, మృతురాలి తండ్రి కొర్రా శ్రీరాములు ఆరోపించారు. అల్లుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పరామర్శ


రామభద్రరాజు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కోటవురట్ల: మండలంలోని ఏటికొప్పాక చక్కెర కర్మాగారం మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ రామభద్రరాజు కుటుంబ సభ్యులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లి సుభద్ర సోమవారం పరామర్శించారు. తంగేడులోని ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

రామభద్రరాజు కుమారుడు సతీష్‌రాజుకు ధైర్యం చెప్పి సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ రామచంద్రరాజు, ఆర్.ఎస్. సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, శెట్టి రమణ పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ జగనన్న ప్రభుత్వం


విత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను ప్రారంభించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్


అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. మండలంలోని వెంకుపాలెంలో రూ.21.80 లక్షలు, చినసంపతిపురంలో రూ.10 లక్షలతో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. తొలుత ఆయనకు గ్రామస్తులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను మినీ పాఠశాలలుగా ప్రభుత్వం మార్పు చేయనుందన్నారు. బాలింతలకు, గర్భిణులకు వీటి ద్వారా పోషక విలువలున్న ఆహారాన్ని అందజేస్తున్నామని చెప్పారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొని మేనిఫెస్టోను 99 శాతానికి పైగా అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు రైతులకు వ్యవసాయ శాఖ రాయితీపై అందజేస్తున్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.వి. నరసింహారావు, ఈవోపీఆర్డీ కె. ధర్మారావు, పంచాయతీరాజ్ డీఈఈ వేణుగోపాల్, వ్యవసాయాధికారి రంగాచారి, పల్లా శ్రీను, భీశెట్టి జగన్, వెంకుపాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, రాపేటి వెంకటేష్, ఉప్పులూరి నాగేశ్వరరావు, వెంకుపాలెం, సుందరయ్యపేట సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐసీడీఎస్ ఏసీడీపీవో శశికళ, సీడీపీవో ప్రభావతి, సూపర్‌వైజర్ వంశీప్రియ, మండలంలో వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు

- యువకుడి దుర్మరణం
- మరొకరు కొన ఊపిరితో ఆస్పత్రిలో పోరాటం


మృతి చెందిన మొల్లి సురేష్ (ఫైల్)

యలమంచిలి : వివాహ వేడుకకు వచ్చి తిరిగి అరగంటలో ఇంటికి చేరుకుంటాం అనుకునే లోపే మృత్యువు వారిని వెంబడించి కబలించింది. యలమంచిలి మండలం రేగుపాలెం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడిపాలెం గ్రామానికి చెందిన ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు కొన ఊపిరితో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. యలమంచిలి రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం ఉపమాక పంచాయతీ మామిడిపాలెం గ్రామానికి చెందిన మొల్లి సురేష్ (21), మొల్లి నాగేష్ (16) ఆదివారం కశింకోట మండలం నర్సింగబిల్లిలో ఒక వివాహ వేడుకలో కిల్లీలు సరఫరా చేయడానికి వెళ్లి తిరిగి స్వగ్రామం తమ ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. యలమంచిలి మండలం రేగుపాలెం హైవే జంక్షన్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో మొల్లి సురేష్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న నాగేష్‌ను విశాఖలోని కింగ్స్ ఐకాన్ ఆస్పత్రి తరలించారు. ఈ ఘటనతో బంధువులైన ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ బస్సును సీసీ పుటేజి సహాయంతో యలమంచిలి రూరల్ పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. సురేష్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

ద్విచక్రవాహనం దిగుతూ రోడ్డుపై పడి..

నర్సీపట్నం : ద్విచక్రవాహనం దిగుతుండగా ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడి తలకు గాయమై మృతి చెందింది. టౌన్ సీఐ ఎస్.గణేష్ అందించిన వివరాలివి. మున్సిపాలిటీ పరిధి అయ్యన్న కాలనీకి చెందిన వి.సావిత్రి(75) ఆరోగ్యం బాగలేక పోవడంతో ఆస్పత్రిలో చూపించుకునేందుకు నర్సీపట్నం నడిచి వస్తోంది. మార్గం మధ్యలో తెలిసిన వ్యక్తి అటుగా వస్తున్న బైక్‌ను ఆపి వృద్ధురాలిని ఎక్కించాడు. నర్సీపట్నం రాగానే ఆమె బైక్ దిగుతుండగా ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిపోయింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఇతర నాయకులు

మంత్రి మేరుగు నాగార్జున

పరవాడ: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. మండలంలోని దేశపాత్రునిపాలెం శివారు సాయినగర్‌కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆయన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి రాష్ట్రంలో ఇటువంటి సంక్షేమ పాలనను ఎన్నడూ చూడలేదన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఓ వర్గానికో, మతానికో ఆపాదించడం సబబు కాదన్నారు. అంబేడ్కర్ అందరి వాడని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.పూర్ణానందశర్మ, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, దళిత నాయకులు బూసి వెంకటరావు, ఎల్వీ రమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, యలమంచిలి అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, దేవిరెడ్డి రమణ, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హోంగార్డు దుర్మరణం

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదం


కుమారస్వామి (ఫైల్)


హోంగార్డు కుమార స్వామి మృతదేహం


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య హైమ

అనకాపల్లిటౌన్ : మండలంలోని కాపుశెట్టివానిపాలెంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు సబ్బవరపు కుమారస్వామి (36) మృతి చెందారు. అనకాపల్లి గ్రామీణ ఎస్‌ఐ సీహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలివి. కుమారస్వామి సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. సబ్బవరం రహదారి ఇరువాడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకుని వచ్చినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచి సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో అనకాపల్లి నుంచి సబ్బవరం స్టేషన్‌కు వెళుతుండగా కాపుశెట్టివానిపాలెంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన నిర్మించిన కాలువలో పడిపోయింది. దీంతో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి భార్య హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

చంద్రయ్యపేటలో విషాదఛాయలు

కె.కోటపాడు : అనకాపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు ఎస్.కుమారస్వామి మృతిచెందడంతో ఆయన స్వగ్రామం చంద్రయ్యపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరితో సరదాగా ఉంటూ, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే కుమారస్వామి మృతి గ్రామస్తులను కలచివేసింది. ఎప్పటిలానే విధులకు వెళ్లిన భర్త సోమవారం ఇంటికి తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న భార్య హైమకు రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందాడన్న సమాచారం తెలిసి భోరున విలపించింది. ఆమెను ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. మృతునికి భార్య, 4, 6 ఏళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రయ్యపేటలో కుమారస్వామి మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. అంతకు ముందు కుమారస్వామి భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం నిర్వహించారు.

ప్రతి అర్జీకి స్పష్టమైన రీతిలో సమాధానం


వినతులు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి, డీఆర్వో వెంకటరమణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- కలెక్టరేట్‌లో జేసీ జాహ్నవి
- జగనన్నకు చెబుదాం (స్పందన)కు 129 అర్జీలు

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీకి స్పష్టమైన రీతిలో సమాధానం ఇవ్వాలని జేసీ ఎం.జాహ్నవి అన్నారు. కలెక్టర్ కార్యాలయం వీసీ హాలులో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమెతోపాటు డీఆర్వో పి.వెంకటరమణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి మరింత మెరుగులు దిద్దుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారుడికి సంతృప్తినిచ్చే విధంగా సమస్య పరిష్కరించాలన్నారు. ప్రతి శుక్రవారం మండల, డివిజన్ స్థాయిలో ఆయా శాఖల సమన్వయంతో నిర్వహించే రివ్యూ కార్యక్రమం మంచి పురోగతిని సాధిస్తుందన్నారు. మొత్తం 129 అర్జీలు నమోదవ్వగా, అత్యధికంగా భూసంబంధిత సమస్యలు, పట్టాల మంజూరుపై ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- 17 సంవత్సరాలుగా విధుల్లో ఉన్న తమను ప్రభుత్వ ఉద్యోగుల సమాన హోదాతో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలో క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ ఉపాధి హామీ ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మమ్ములను అర్హతల ఆధారంగా న్యాయం చేయాలని కోరారు. ఉపాధి హామీ ఉద్యోగుల అసోసియేషన్ చైర్మన్ ఎస్.అప్పలరాజు, కార్యదర్శి డి.కొండాజీ, ట్రెజరర్ శివానీ జేసీకి వినతి పత్రం అందించారు.
- బకాయి వేతనాలు చెల్లించాలంటూ ఎస్.రాయవరం మండలం పెద ఉప్పలం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు కుందూరి రాములు, జోగారావు, వెంకటరమణ విన్నవించుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్నప్పటికీ ఆర్నెల్లుగా జీతాలు మంజూరు చేయడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లను అడిగినా తామేమీ చేయలేమంటున్నారని వాపోయారు. నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన మాకు జీవనోపాధి కరువవుతుందని, తక్షణమే బకాయి జీతాలను చెల్లించాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 34 అర్జీలు

అనకాపల్లి టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 34 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటూ.. తక్షణమే పరిష్కరించాలని దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనకు వచ్చే అర్జీలకు నిర్ణీత సమయంలో నివేదిక అందించాలన్నారు. ఆస్తి తగాదాలు, భూసమస్యలు, కుటుంబ సమస్యలపై అర్జీలు వచ్చాయని, చట్టపరిధిలో వాటికి త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్.బి ఇన్‌స్పెక్టరు చంద్రశేఖర్, ఎస్‌ఐ చక్రధర్ పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

కె.కోటపాడు : మద్యానికి బానిసైన ఓ వ్యక్తి భార్య మందలించిందన్న మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎ.కోడూరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపిన వివరాలివి. ఎ.కోడూరు గ్రామానికి చెందిన బొడ్డు అవతారం (40) మద్యానికి బానిసై నిత్యం మద్యం సేవించడంతో భార్య ముత్యాలమ్మ సోమవారం మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన అవతారం పురుగుమందు తాగాడు. భర్త అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన భార్య కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లింది. అక్కడ ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అవతారం మృతి చెందాడని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

పాఠశాలలో అక్రమంగా చెట్లు నరికివేత


నాగయ్యపేట ఎంపీయూపీ పాఠశాలలో ఆవరణలో నరికి వేసిన చెట్లు

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలు చెట్లను స్థానిక తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వేమల కృష్ణ అక్రమంగా నరికించేశాడు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో ఈ విషయం బయటకు రాలేదు. హెచ్‌ఎం ఆలస్యంగా గుర్తించడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలను పరిరక్షించాల్సిన తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు నరికివేయించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నిలువ నీడనిస్తున్న పచ్చని చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేయించిన కృష్ణ నిర్వాహకాన్ని హెచ్‌ఎం ఆదిరెడ్డి కృష్ణ మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.రవీంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎంఈవో సూచన మేరకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ వేమల కృష్ణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్, ఎంపీడీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో భారీ వేప చెట్టుతో పాటు మరికొన్ని చెట్లు ఉన్నాయి. వీటిని నరికించేసి ఆ కలపను సుమారు రూ.10 వేలకు విక్రయించినట్టు సమాచారం. ఈ విషయంపై ఎంఈవో రవీంద్రబాబును వివరణ కోరగా వేమల కృష్ణపై హెచ్‌ఎం ద్వారా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేయించామన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల సందడి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులకు నిబంధనలకు ప్రకారం బదిలీలు చేస్తున్నారు. ఒకే దగ్గర రెండేళ్లు పూర్తి చేసుకున్న వారికి రిక్వెస్టు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ గడువు సోమవారంతో ముగిసింది. భార్యాభర్తలు, అనారోగ్య బాధితులకు బదిలీల్లో తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇటీవల ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలో సుమారు 140 మందికి పరస్పర బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు నోడల్ అధికారిగా మొత్తం మూడు జిల్లాల సిబ్బందిని బదిలీ చేయవలసి ఉంది. మొత్తం అన్ని కేడర్లకు సంబంధించి 43 దరఖాస్తులు అందాయి.

ఏళ్ల తరబడి తిష్టవేసిన వారికి స్థానచలనం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌వో), వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, వివిధ అనుబంధ సంస్థల కార్యాలయాల్లో ఏళ్ల తరబడి తిష్ట వేసిన వారికి బదిలీలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో బదిలీలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో, ఉత్తరాంధ్ర జిల్లాల్లో బదిలీలను వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఎన్.ఉమా సుందరి ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులు ఉమ్మడి జిల్లాల్లో 35 మంది వరకు ఉన్నట్టు గుర్తించారు.

బాలలతో పనులు చేయిస్తే శిక్షార్హులే..

సబ్ జడ్జి సత్తి అరుణశ్రీ


ప్రదర్శన చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది

చోడవరం రూరల్: బాలలతో పనులు చేయించడం ఎంతటి వారైనా శిక్షార్హులవుతారని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ హెచ్చరించారు. సోమవారం స్థానిక కోర్టుల సముదాయంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణల నేతృత్వంలో ఇక్కడ కోర్టుల సముదాయం నుంచి విఘ్నేశ్వరాలయం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్సు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ జడ్జి అరుణశ్రీ మాట్లాడుతూ బాలల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులదని, వారిని కూలీలుగా మార్చే హక్కు వారికి లేదని సూచించారు. ఎక్కడైనా బాలలను పనివారిగా చేర్చుకుంటే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదనపు జూనియర్ జడ్జి స్వర్ణ మాట్లాడుతూ పిల్లలను కన్నంత మాత్రాన వారిని బాల్యంలోనే పనివారుగా మారుస్తామంటే చట్టాలు ఒప్పుకోవన్నారు. చోడవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కృష్ణవేణి, విశ్రాంత ఉపన్యాసకులు నడుపూరి దేముడు, ఉపాధ్యాయులు తానారపు వెంకటరమణ, వర్ఘుల రమేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్‌లకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరినందున అక్కడ నుంచి బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరాలో ఈనెల 13వ తేదీన బయల్దేరాల్సిన హౌరా-విశ్వేశ్వరయ టెర్మినల్ బెంగళూరు(22887) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరులో ఈనెల 15వ తేదీన బయల్దేరాల్సిన విశ్వేశ్వరయ టెర్మినల్ బెంగళూరు-హౌరా(22888) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరాలో ఈనెల 14వ తేదీన బయల్దేరాల్సిన హౌరా-శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం (22831) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయంలో ఈనెల 16వ తేదీన బయల్దేరాల్సిన శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-హౌరా(22832) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

అట్రాసిటీ కేసులో ముగ్గురి అరెస్టు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో ఆత్మహత్యకు సంబంధించిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జగ్గన్నపేటకు చెందిన బొర్రా రవి కుమార్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. అతని మృతికి మల్ల శేషు, పంద్రాన బుజ్జి, పంద్రాన నళిని, కారణమని మృతుడి తల్లి బొర్రా మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వడదెబ్బకు ఒకరి మృతి


మృతుడు రమణ

నక్కపల్లి : మండలంలో పెదతీనార్లలో సోమవారం వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మరణించాడు. కిరాణా వ్యాపారం చేస్తున్న మైలపల్లి రమణ (40) సోమవారం మధ్యాహ్నం దుకాణం మూసి ఇంటికి వెళ్లి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోపే మరణించాడని ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోశాల



గోశాలలో గోవులను దర్శించుకుంటున్న సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మించిన గోశాలను కమిటీ సభ్యులు సోమవారం ప్రారంభించారు. తొలుత గోశాలలో గోమాతను ప్రవేశం చేయించారు. గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు పొంగించి, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు లలితా విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని గోమాతను పూజించారు. కార్యక్రమంలో దేవస్థానం సంఘం అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివలింగానికి తెల్ల జిల్లేడు పూల మాలలతో అలంకరణ

కశింకోట : స్థానిక శివాలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ లింగానికి తెల్ల జిల్లేడు పూల మాలతో అలంకరించి పూజారులు వి.శంకరం, వి. చిదంబరంల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా మినహా కూరగాయల ధర లు స్థిరంగా ఉన్నాయి. టమాటా కిలో రూ.50 కాగా, ఉల్లిపాయ రూ.20, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, వంకాయ, దొండ, బెండ రూ.40, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 186 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,800	4,800
రెండో రకం	3,960	4,260
మూడో రకం	3,870	3,950

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
అన్‌స్టాపబుల్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 21 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 318 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

బడి గంట మోగింది

- తొలి రోజు 4,180 మంది విద్యార్థుల హాజరు
- విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ

తొలి రోజు బడి గంట ఉదయాన్నే మోగింది. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ఒంటి పూట తరగతులతో స్కూళ్లు ప్రారంభమయ్యాయి. దాదాపు నెలన్నర రోజుల విరామం తర్వాత స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ఆనందంగా బడిబాట పట్టారు. కశింకోటలోని డీపీఎస్ హైస్కూల్‌తోపాటు పలు పాఠశాలలకు మామిడాకులతో తోరణాలు కట్టి విద్యార్థులను స్వాగతించారు.



వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్/కశింకోట : వేసవి సెలవుల అనంతరం స్కూళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల ఆట పాటలు, తరగతుల నిర్వహణతో కళకళలాడాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ నెల 17 వరకు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు ఒంటి పూట మాత్రమే తరగతులు జరుగుతాయి. చాలా చోట్ల తొలి రోజే జగనన్న విద్యా కానుక పంపిణీ కూడా చేపట్టారు. దీంతో విద్యార్థులు ఆనందంగా స్కూళ్లకు వచ్చి, విద్యా కానుక అందుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంగా బిర్యానీ, కోడిగుడ్ల కూర, చిక్కీలను సరఫరా చేశారు. వేసవి సెలవుల అనంతరం తొలి రోజు కావడంతో విద్యార్థుల హాజరు తక్కువగా ఉంది.



కశింకోట బాలికల హైస్కూల్ స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు వ్యాన్‌లో తరలిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు

తొలి రోజు హాజరు 51.45 శాతం

అనకాపల్లి పట్టణం, మండల పరిధిలో 19 హైస్కూళ్లు, 8 యూపీ, 80 ప్రైమరీ కలిపి మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలల్లో 8,123 మంది విద్యార్థులు ఉన్నారు. మొదటి రోజు 51.45 శాతంతో 4,180 మంది విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మొత్తం లక్షా 22 వేల 991 పుస్తకాలకు గాను, లక్షా 991 పుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి.



మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా తయారు చేసిన బిర్యానీ

మిగిలిన 22 వేల పుస్తకాలు జిల్లా కేంద్రం నుంచి రెండు రోజుల్లో వస్తాయని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్ట్, డిక్షనరీ తదితర సామగ్రితో జగనన్న విద్యా కానుక కిట్లను సిద్ధం చేశారు. పలు పాఠశాలల్లో తొలి రోజే పంపిణీ చేశారు. ఉదయం రాగి జావ, మధ్యాహ్నం భోజనం అందించారు.

జగనన్న కానుక అందుకున్నా..



జగనన్న విద్యా కానుక కిట్ తీసుకున్నాను. మొదటి రోజు స్కూల్‌కు వెళ్లిన వెంటనే పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇలా అవసరమైన పూర్తి కిట్ అందుకోవడం ఆనందంగా ఉంది. రాగి జావ, మధ్యాహ్న భోజనం చాలా బాగుంది.

– షేక్ తాజుద్దీన్, 10వ తరగతి, జీవీఎంసీ పెద్ద హైస్కూల్

నేటి నుంచి పంపిణీ

మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను చేరవేశాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా కిట్లను పాఠశాల స్థాయిలో విభజించాం. కశింకోటలోని స్టాక్ పాయింట్ బాలికోన్నత పాఠశాల నుంచి దాదాపు అన్ని పాఠశాలలకు తరలించాం. వీటిని ఆయా పాఠశాలల్లో మంగళవారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేయనున్నాం.

–చిట్టిబాబు, మండల విద్యా శాఖాధికారి, కశింకోట

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి రూరల్ : అనకాపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఈవో)గా సోమవారం బాధ్యతలు చేపట్టిన కేవీ నర్సింహారావుకు మండలానికి చెందిన పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈవోఆర్డీ కె.ధర్మారావు, జూనియర్ అసిస్టెంట్ పి.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ఫణికుమార్, మండల పరిషత్ సిబ్బంది ఆయన్ని అభినందించి, సత్కరించారు. అంతకు ముందు ఆయన రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మంచినీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



ఎంపీడీవో నర్సింహారావును సత్కరిస్తున్న కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది

16న ఉమా సాంబశివుని కల్యాణం

కశింకోట: స్థానిక కస్పావీధి ఉమా సాంబశివుని కల్యాణోత్సవాన్ని ఈ నెల 16న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వెయ్యి దళముల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉమా, సాంబశివుని ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపిస్తామన్నారు. ఆలయంలో ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరపనున్నట్లు వెల్లడించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

తుమ్మపాల: పట్టణంలోని 83వ వార్డు లక్ష్మీదేవిపేట శ్రీదుర్గాదేవి అమ్మవారి ఆలయ ఏకాదశ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం ఐదు వేల మందికి అన్నసమారాధన జరిపారు. ఉత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు గొర్లి రాము, కార్యదర్శి వేపూరి రమేష్, డీపీఎం కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



దుర్గాదేవిని దర్శించుకుంటున్న దాడి వీరభద్రరావు

భీమునిగుమ్మంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 గంటలకు 83వ వార్డు పరిధిలోని రైల్వే స్టేషన్ రహదారి భీమునిగుమ్మం అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభం కానున్నట్లు వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ట

రూ.లక్ష విరాళం అందజేసిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్మాణం కోసం తన వంతు సాయంగా రూ. లక్ష చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలుతో పాటు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు అభయాంజనేయస్వామిని దర్శించుకొని పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో పరిసర గ్రామాల భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.



కమిటీ పెద్దలకు విరాళం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

'రేషన్ డీటీని నియమించాలి'

అనకాపల్లిటౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీటీని ప్రభుత్వం తక్షణమే నియమించాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అనకాపల్లి జిల్లా ఏర్పడినప్పటి నుంచి రేషన్‌డీటీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. పట్టణ, మండలంలో రేషన్ దుకాణాల్లో జరుగుతున్న సమస్యలను చెప్పుకునేందుకు ఓ అధికారి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తక్షణమే కలెక్టర్ స్పందించి రేషన్ డీటీని నియమించాలని కోరారు.

పశు పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

మునగపాక : పశువుల ఆరోగ్యం విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. తోటాడ సచివాలయంలో సోమవారం పశువుల పెంపకం-వాటి ఆరోగ్యంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేలు జాతి పశువులను కొనుగోలు చేయాలని, దాణా విషయంలో జాగ్రత్తలు పాటించాలని, పశువులకు ఎటువంటి అనారోగ్యం సంభవించిన అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

సాయిబాబా ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి సర్పంచ్ బండారు కల్పనరాజశేఖర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి ముందడుగు వేసిన ఎలక్ట్రికల్ యూత్ సభ్యులను ఆమె అభినందించారు. ఆలయ నిర్మాణానికి తమ సహాయ సహకారాలు ఉంటాయని సర్పంచ్ కల్పన రాజశేఖర్ హామీ ఇచ్చారు.జె.శ్రీను, గుండు లోకేష్, గొంతిన దుర్గాప్రసాద్, కలిదిండి శ్రీనివాసరావు మాజీ ఎంపీటీసీ దెక్క శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దేముడు, రామకృష్ణరాజు, బోయన్న, సూరిబాబు, రాము పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గత నెల 8వ తేదీ నుంచి నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు సోమవారంతో ముగిశాయి. వేసవి శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఎంపీపీ కోన బుజ్జి, సర్పంచ్ విమలనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠకులకు, విద్యార్థులకు వక్తలు సూచించారు.గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కోనబుజ్జి, విమలనాయుడు తదితరులు

ఎండలు మండే!



కశింకోటలో బోసిపోయిన ప్రధాన రహదారి

కశింకోట : రోహిణి కార్తె పోయి మృగశిర కార్తె వచ్చినా వేసవి తాపం ప్రజలను ఇంకా వీడలేదు. సోమవారం కూడా వేసవి తాపంతో ప్రజలు సతమతమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు వేడి గాలులు, ఉష్ణతాపంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు ఎక్కువగా ఇబ్బంది పడ్డారు. కశింకోటలోని ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఆకాశం మబ్బులుపట్టి కాస్త వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

82వ వార్డులో 'గడప గడపకు' రేపు

తుమ్మపాల: 82వ వార్డు పరిధిలో ఈ నెల 14న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సచివాలయం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. పరశురాం పేట, శారదా కాలనీల్లో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జానకీరామరాజు

డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.1.40 లక్షల జరిమానా

అనకాపల్లిటౌన్: పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మంది వాహనదారులకు సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను, ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే మీతోపాటు, ఇతరుల ప్రాణాలకు కూడా హాని జరుగుతుందని హెచ్చరించారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్క వ్యక్తికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. 14 మంది వాహనదారులు రూ.1.40 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి, వారి వాహనాలను తీసుకున్నారని సీఐ వెల్లడించారు.



మద్యం సేవించి వాహనం నడిపిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ సత్యనారాయణ

వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది కంటి రోగులను ఆప్తాలమిక్ అధికారి సంధ్య పరీక్షించారు. వీరిలో ముగ్గురికి శస్త్ర చికిత్సలు, 17 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. మండలంలో శిబిరాలు పూర్తి అయిన తర్వాత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారందరికీ ఒకేసారి జరిపిస్తామన్నారు. కళ్లద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో వైఎస్సార్ కంటి వెలుగులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ అధికారి సంధ్య

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

అనకాపల్లిటౌన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని న్యాయమూర్తులు జి.గంగరాజు, శివకిరణ్‌లు పిలుపునిచ్చారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు సముదాయం నుంచి రింగ్‌రోడ్డు వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చదవించాలి తప్ప, పనిలో పెట్టరాదని కోరారు. కర్మాగారాల్లోను, హోటళ్లలోను పిల్లలతో పనిచేయించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు కోర్టు సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.



బాలకార్మిక దినోత్సవ ర్యాలీలో న్యాయమూర్తులు గంగరాజు, శివకిరణ్

భావ కల్యాణ పోతురాజు ఆలయ శంకుస్థాపన

యలమంచిలి : మండలంలోని లైనుకొత్తూరు మర్రిబంధ గ్రామంలో భావ కల్యాణ పోతురాజు స్వామి వారి ఆలయ పునర్నిర్మాణం కోసం సోమవారం గ్రామ పెద్దలు ఘనంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఎప్పటి నుంచే ఆలయాన్ని పునరుద్ధరించాలనుకున్న తమ కోరిక ఇప్పటికి నెరవేరుతోందన్నారు. గ్రామ ప్రజల సహకారంతో త్వరలోనే సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణం జరుగుతుందని గ్రామ ప్రజలు తెలిపారు.



పోతురాజు స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామ ప్రజలు

పుష్ప విలాసం

నిండా పూలతో కనువిందు చేస్తున్న పూల మొక్కలు





కొక్కిరాపల్లి వద్ద విరగబూసిన తురాయి చెట్టు



అనకాపల్లి సమీపంలో హైవేపై పూల సౌరభం

జిల్లాలో పాయకరావుపేట నుంచి అనకాపల్లి వరకూ విస్తరించి ఉన్న ఎన్‌హెచ్ 16కు ఇరువైపులా, డివైడర్ల మధ్య మండు వేసవిలోనూ పూలు విరబూసి ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. తురాయి, కాగితం పూలు, ఎర్ర గన్నేరు పూల మొక్కలు విరగ్గాస్తున్నాయి. ఎండలు మండిపోతున్నా హైవేకు ఇరువైపులా మొక్కల నిర్వహణలో ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది నిరంతర కృషి ఫలితమిస్తోంది. పూల మొక్కలకు నీటి కొరత లేకుండా చేయడంతో ప్రయాణికులకు హైవే పుష్ప సోయగం ఎంతగానే అలరిస్తోంది. తురాయి చెట్లకు ఆకుల కంటే పూలే ఎక్కువగా కనిపిస్తూ హైవేపై స్వాగతం పలుకుతున్నాయి. వివిధ రకాల చెట్లు నిండా పూలతో మగువల మనసు దోచుకుంటున్నాయి. ప్రకృతి ప్రేమికుల మనసులను రంజింపజేస్తున్నాయి. బైక్‌లపై ప్రయాణించే వారు దృశ్యాలను తమ మొబైల్ ఫోన్స్‌లో భద్రపర్చుకుంటుండగా, మరికొందరు సెల్ఫీలు దిగుతున్నారు.

- అనకాపల్లి రూరల్